# కన్యాదానం

## ఆదిమధ్యం రమణమ్మ

తెల్లవారు ఝాము చల్లని పిల్లగాలి ప్రాణుల్ని పరవశింప జేస్తోంది.

పచ్చని, తాటె ఆకులూ, ఆకు పచ్చని, మామిడాకులూ గాలి కౌగిలిలో, గుసగుస లాడుకుంటున్నాయి. ముసి ముసిగా నవ్వుకుంటున్నాయి. అటూ ఇటూ ఊగి తూగి ఒంగి తొంగి చూస్తున్నాయి, పెళ్ళి విశేషాల్ని.

ముందుగా వాటికి రకరకాల తలలు కనిపిస్తున్నాయి. రకరకాల ముడులు, జడలు, రెండు జడలు, బాబ్డ్ హెయర్‌స్టైల్ కట్టింగ్స్, జాజులు మల్లెలు, కనకాంబరాలు, అలంకరించికున్న పూబోడులు. పట్టు చీరెలూ పట్టు పరికిణీలు నూలు జరీలూ, నైలానులూ, పోలియస్టర్ షర్ట్సు, ఫేంట్స్, జరీ పంచెలు హడావిడిగా తిరుగుతున్నాయి పెళ్లిపందిట్లో.

పన్నీటి చిలకరింపులాంటి, పలకరింపులు, సంతోషం వెల్లి విరిసే నవ్వులు. ఏదో తెలియని హడావిడి, పసిపిల్లల ఏడుపులు, కొంచెం ఎదిగిన పిల్లల పరుగులు, స్తంభాలాటలు పెళ్లికాని యువతీ యువకుల వాలు చూపులు, తీయని తలపులు, పెద్దల హడావిడి పరుగులు, పురోహితుల అరుపుల, పిలుపులు, బాజా భజంత్రీల సినిమా పాటలు.

పెళ్లి పందిరి కోలాహలంతో దద్దరిల్లి పోతోంది. అందరిలో ఉత్సాహం ఉప్పొంగి పోతోంది.

పందిరి మధ్య పూలతో అలంకరించిన మండపం, దానిమీద ఒకపాదుగాటి పెళ్లిపీట, దానికి ఎదురుగా రెండు ప్రక్కలా చిన్న చిన్న మరో మూడు పీటలు, గంధపుగిన్నె పన్నీరు బుడ్డి, అక్షతలు ఒక పళ్లెంలో. మరికొన్ని పళ్లేలలో తలంబ్రాల బియ్యం. పసుపు వినాయకుడూ, పసుపు కుంకుమలూ, అరటిపళ్ల ఊదొత్తులూ, కర్పూరం వగైరాలు, మండపానికి ఎదురుగా పెద్ద పెట్టెముందు పెట్టుకుని మగపెళ్లివారి తాలూకు పెద్ద ఒకాయన కూర్చున్నారు. మరి కొందరు కుర్చీలలో ఆశీనులయ్యారు. మరి కొంత సేపటికి, పెళ్లివారు, పెళ్లికొచ్చిన ఆహూతులు, ముందువరస కుర్చీలలో ఆశీనులయ్యారు.

మంగళస్నానాలు ముగిసాయి.

మగపెళ్లివారి తాలూకు, పురోహితుడు, పెళ్లికొడుకు చేత మంత్రాలతో ఏదో తంతు' జరిపిస్తున్నాడు.

లోపల, పెళ్లికూతురు చేత గౌరీపూజ చేయిస్తున్నాడు ఆడ పెళ్లివారి తాలూకు పురోహితుడు.

గౌరీపూజ ముగిసింది. బుట్టలో కుర్చున్న పెళ్లి కూతుర్ని హాస్యాలతో, మేనమామలు, పెళ్లిపందిరిలోకి మోసుకొచ్చారు. మధ్యమధ్య ఆపుతూ, నవ్వుతూ, సిగ్గుతో ముదుచుకు పోతూ మధ్య మధ్య ఫొటోలకు పోజులిస్తూ, పెళ్లి కూతురు లీల మెరిసిపోతోంది.

మంత్రాల జోరూ, బాజా భజంత్రీల హోరు, ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

పెళ్లి కూతురు తల్లిదండ్రులు ఆమె వెనక పీటల మీద కూర్చున్నారు. ఆమె వెనకగా ప్రక్క ప్రక్కగా స్నేహితులు సన్నిహితులైన చిన్నపిల్లలు, ఆమె తల్లి దండ్రులు ఇరువైపుల దగ్గర బంధువులు.

పెళ్లికొడుక్కీ పెళ్లికూతురికీ మధ్య తెరసెల్లా పటు కుని ఇద్దరు నించున్నారు.

పెళ్లికొడుకు వెనకాల, అతని చెల్లెళ్ళు కొంచెం వెనకగా తల్లిదండ్రులు, వో ప్రక్క స్నేహితులు, జోక్స్, సకిలింతలు.

పెళ్లి కూతురి చేతులో తాంబూలం, కొబ్బరి బొండం, కాస్త ప్రక్కగా గుమ్మడి పండు, అరటి గెల వగైరాలు.

పెళ్లికొడుకు కాళ్లు పళ్లెంలో పెట్టించి, కన్యాదాత కాళ్లు కడుగడం అయింది.

ఇహ కన్యాదానం. పెళ్లి కూతురు తల్లిదండ్రులు ఆమె చేతులు, తమ చేతుల్తో పట్టుకున్నారు. పురోహితుడు, కన్యాం కనక సంపన్నాం'' వేదమంత్రం సాగిస్తున్నాడు.

లీల మెదడులో ఏదో తలపు మెరుపులా, దూసుకు పోయింది. అంతే, చటుక్కున చేతులు విదిలించుకొని కొబ్బరి బొండం తాంబూలం ఒళ్ళో వదిలేసింది. చేయెత్తి మంత్రాలు ఆపమన్నట్టు పురోహితునికి, సౌజ్ఞ చేసింది. బిత్తర బోయి చూశాడు పురోహితుడు, తల్లి దండ్రులు కంగారు పడ్డారు. ఆమె ఏదో అన్నది. అది పురోహితునకు వినిపించలేదు. దగ్గరగా రమ్మని చెయ్యి ఊపింది.

ఆయన కాస్త జరిగి, పెళ్లికూతురు దగ్గర చెవి ఒంచాడు.

''చూడండి, నేను ఆవునీ, దూడనీ కాదు. దానం చెయ్యడానికి, అది తప్పించి మిగతా తంతు కానియ్యండి.

ఆయన విస్తుబోతూ ''అదేంటమ్మా ఇది చాలా కాలం నుంచీ వస్తున్న సంప్రదాయం. మానెయ్యడ మెలాగ?''

''ఫరవాలేదు మార్చుకోవచ్చు''

లీల తల్లిదండ్రులు కంగారు పడ్డారు. తండ్రి ''ఏం అమ్మడూ, అడ్డు చెబుతున్నావ్, తల్లీ ఊరుకో'' అన్నాడు.

''నలుగురులో మాకు అప్రదిష్ట తేకు'' కూతురుకు మాత్రమే వినిపించేలా కోప్పడింది తల్లి.

''సరే ఇంకా ఏవేవి తప్పించమ ంటావమ్మా'' అన్నాడు పురోహితుడు వెటకారంగా.

''మేమిద్దరం ఒకరికొకరు చేసుకొనే తంతులన్నీ అనగా ప్రమాణాలు తలంబ్రాలు లాంటి వన్నీ. అంతేగాని కన్యాదానం వద్దు. మా అమ్మా నాన్న నన్ను దానం చెయ్యడమేమిటి? మేమిద్దరం వివాహం చేసుకుని భార్యా భర్తలమవుతున్నాం అంతే'' అంది నిష్కర్షగా. ''నేను ఆవునా దూడనా''

పెళ్లి కూతురేదో పేచీలు పెడుతుందనీ అది తనకు వినబడ్డం లేదని మగపెళ్లివారి తాలూకు పురోహితుడు, బాజా భజంత్రీలని ఆపమని సౌంజ్ఞ చేశాడు. అవి ఆగాక విషయం తెలుసుకుని ''అయితే పెళ్లికెందుకు ఒప్పుకున్నావ్ అమ్మాయ్'' అన్నాడు కోపంగా

పెళ్లి మండపంలో ఏదో గొడవ జరుగుతుందని గుర్తుమంది. అంతా ముంధుకు తోసుకు వస్తున్నారు. పెళ్లి కూతురు స్నేహితురాళ్లు ''ఏంటోయ్ గమ్మత్తు చేస్తున్నావ్ చెయ్ చెయ్'' అని కొందరు హుషారిస్తే'' బుద్ధిగా ఉండవే బాబూ నలుగురిలో అల్లరి అభాసు అయిపోతావు'' అని మందలించారు మరి కొందరు. తల్లి కూతురి తొడమీద గట్టిగా పిక్కపాశం పెట్టేసింది.

తండ్రి ఏం చెయ్యాలో తోచక కంగారు పడుతున్నాడు.

మగ పెళ్లివారి తాలూకు పురోహితుడు లేచి, పెళ్లి కొడుకు తండ్రికీ, పెద్దలకీ విషయం వివరించాడు.

పెళ్లి కొడుకు తండ్రి రోషంతో ఆవేశంతో ఊగిపోతూ మండపం మీద కొచ్చాడు.

''లేవరా అబ్బాయి పీట మీదనుంచి'' అన్నాడు ఆవేశంతో రొప్పుతూ .

''ఊరుకో బావా ఏంటి పెద్ద కొంప మునిగినట్లు హడావుడి చేస్తున్నావ్'' పెళ్లి ఆవు చెయ్యకు తప్పు, తప్పు, ఏదో ఈ కాలం పిల్లలకి, కొన్ని పాత పద్ధతులు నచ్చవు. పెళ్లి ఆపు జెయ్యడం పాపం. తప్పు అని చెయి పట్టుకుని బలంగా వెనక్కిలాగాడు బావగారిని, ఆయన బావమరిది. మనసు లోలోపల మాత్రం 'నా పిల్లని చేసుకోవందుకు నీకు రోగం బాగా కుదిరిందిలే. ఖలే పెంకి పిల్లలుఉంది భేష్'' అని అనుకున్నాడు పెళ్లి

కొడుకు మేనమామ. ఆయనకి చాలా సంతోషంగా ఉంది. పన్నీటిలో స్నానం చేసినట్లు చందనం ఒళ్లంతా రాసుకున్నట్లుగా ఉంది. పురోహితుణ్ణి ఉద్దేశించి "మీరు పెళ్లి చేయించడానికి వచ్చారా ఆవు చేయడానికి వచ్చారా, ముహూర్తం దగ్గర పడుతోంది కానియ్యండి కానియ్యండి" పురోహితుణ్ని పెద్ద గొంతుతో హడలగొట్టేశాడు. బావగార్ని వెనక్కి లాక్కొచ్చి కుర్చీలో కూలేశాడు.

పెళ్లికూతురు తండ్రి ముందుకొచ్చి వియ్యంకుడి చేతులు పట్టుకొని "బావగారు ఏదో చిన్నపిల్ల తెలిసీ తెలియని తనం, నా ముఖం చూసి క్షమించండి. మీకు నావల్ల ఏలోటూ రానియ్యను. పెళ్లి ఆపకండి మీకూ ఆడపిల్లలున్నారు" అని ప్రాధేయపడ్డాడు.

ఇటు పెళ్లి పెద్దలంతా ఇలా హడావిడి పడుతూన్న సమయంలో అటు పెళ్లి కూతురు బుట్టలోంచి లేచిపోయి పీటల మీద కూర్చుంది.

తెరసెల్లా ఎపుడో వదిలేశారు అది పట్టుకున్నవాళ్లు.

పెళ్లి కొడుకుని, తండ్రి లేవమన్నాడు, సరిగ్గా ఆ సమయంలోనే తలెత్తి చురుగ్గా పెళ్లికొడుకు ముఖంలోకి చూసింది లీల. 'లేస్తావా నీవు మగాడివికాదా? నీకు వ్యక్తిత్వం లేదా! అనే, అనేక సవాళ్లతో ఆ చూపు అతని గుండెల్ని దూసుకుపోయింది.

అతను లేవలేదు! నో స్థిర నిశ్చయానికి వచ్చేశాడు. 'నీ తరపునుంచి ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కోగలను అన్నట్లుగా చిరునవ్వునవ్వాడు ఆమె కళ్లల్లోకి చూస్తూ. ఆ తరువాత లీలా చిన్నగా నవ్వింది. చిలిపిగా అతని కళ్లల్లోకి చూసింది. ఆ శుభవేళ ఇద్దరి చూపులూ కలిసాయి.

ఇద్దరి మనసులూ పులకించాయి.

ఇద్దరి శరీరాలూ జలదరించాయి. క్షణంలో సగం.

వారినలా చూసుకోనిస్తారా. పెళ్లి కొడుకు మిత్రులు, అతని చెవి దగ్గర "లేవకురోయ్, లేచావంటే తంతాం" అన్నారు.


పెళ్లి కూతురి తరపు పెద్దలు పురోహితుడి చెవిలో "అలా నెల్లబోయి చూస్తావేమిటయ్యా తంతు జరిపించెయ్యక". అని కోపడ్డారు. తరువాత బాజా భజంత్రీల వద్దకు వెళ్లి "వాయించండి వాయించండి" అని తొందర పెట్టారు.

వాళ్ల హడావిడిగా " మా జానకీ జత పట్టగా మహరాజు నైతివి" అనే త్యాగరాజ కృతిఅందుకున్నారు.

"మంగళ సూత్రాలు కట్టించుకోక పోయావంటే, ఇలాగే వెళ్లి నూతిలో దిగిపోతాను అంది తల్లి లీల చెవిలో. ఆపై మిగతా తంతులన్నీ యధావిధిగా జరిగి పోయాయి. పెళ్లికొడుకు తండ్రికి, ఏదో తెలియని, అవమానంగానూ, కోపంగానూ కినుకగానూ ఉంది. పెళ్లికొడుకు తల్లికి కోపంగానూ భయంగానూ వుంది. ఈ పెంకెపిల్ల సజావుగా కాపరం చేస్తుందా? ఇప్పుడే ఇంత శాసించింది. జడ్డి వెధవ లేవమంటే పీటల మీంచి లేచాడా? అయినా మా అన్న కూతుర్ని చేసుకోనివ్వా వేమిటి? ఆయన రోగం ఇలా కుదరవలసిందే' అని మనసులో మగణ్ణి కొడుకుని విసుక్కుంది.

పెళ్లి వారికి మరిన్ని మర్యాదలు మరిన్ని పిండి వంటలు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరింత డబ్బు






వెదజల్లుతున్నాడా ఆడపిల్ల తండ్రి.

మనోహర (అంటే పెళ్లికొడుకు) తండ్రికి, ఇంకా ఏవేవో పేచీలు పెట్టాలనీ, తగువు పడదామనీ వుంది. కాని పెళ్లి అయిపోయింది. తన బలం తగ్గి పోయింది. పైగా పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఒకటై పోయారు. చేయీ చేయీ పట్టుకుని, ఒకర్ని ఒకరు అతుక్కుపోయినట్లు, వాళ్లంతవాళ్లే పెళ్లి పెద్దలందరికీ నమస్కారాలు పెట్టేస్తున్నారు. ఇంకేవిటి చెయ్యడం?

'చచ్చు వెదవ చచ్చు వెధవ భార్యా దాసుడు. ఛీ ఛీ అని మనసులో దీవెనలకు బదులు తిట్ల వర్షం కురిపిస్తున్నాడు. విడిదిలోకి వెళ్లి, తలపట్టుకు పడుకున్నాడు.

అతని బావమరిదికి మంచి సావకాశం చిక్కింది. "ఏం కొంపమునిగిందని, బావా, నీకు, నీ కొడుక్కి జరగవలసిన మర్యాదలన్నీ జరుగుతున్నాయి కదా.

కోడలా లక్షణంగా లక్ష్మీదేవిలాంటి పిల్ల. ఈ సరదా మళ్లీ రాదు. ముఖం మటమట లాడించుకోక, హుందాగా వుండు. ఏం కొంప మునిగిందిపుడు. మీ ఇంటికి వచ్చాక కోడలు ఎలాగూ లొంగిపోతుంది. మా చెల్లెలు లొంగిపోలే"

'మా చెల్లెలు మా అమ్మాయి లొంగినట్లు పరాయి వాళ్లు లొంగుతారుటోయ్' అనే ఎత్తి పొడువుంది ఆమాటలో.

అసలే ఇదిలా ఉంటే ఇతని దెప్పుళ్లు మరీ బాధిస్తున్నాయి రాజారావుగార్ని. ఈ గోల తప్పించు కోవాలంటే ఇతను చెప్పినట్లు హుందాగా ఉండటమే మంచిది' అనుకున్నాడు మనసులో.

పెళ్లితంతు ముగిసింది మరే గొడవా లేకుండా.

రాత్రి శోభనం జరగవలసివుంది.

శోభనం తంతులేవీ జరపడానికి వీల్లేదంది లీల.

బంధువులందరూ భోజనాలు చేస్తుండగా మేం గదిలోకి వెడతాం. మేం ఏ గదిలోకి వెడుతున్నామో ఎవరికీ తెలియకూడదు"

"ఇదేం చోద్యమే తల్లీ పెళ్లికూడా అయిపోయింది. కాపరంలో చికాకులు తెచ్చుకుంటావా" అని తల్లి మందలించింది.

విడిది ఇంట్లో పెళ్లికొడుకు మిత్రులు "ఒరేయ్ మన పెళ్లి తంతులకే అభ్యంతరం చెప్పిన మీ ఆవిడ,, శోభనం తంతు సవ్యంగా జరగనిస్తుందని అనుకోం. ఏ డార్లింగ్ హోటల్లోనో ఏర్పాటు చెయ్యమని మీ మామ గారికి ముందుగా కబురు పెట్టు దాంతో అమ్మాయి రోగం, అతని రోగం, కాస్త కుదురు తుంది. నీ మాట ఒకటైనా సైమించుకో, ఆ అమ్మాయి, తెలివి అందం, మోహంలో పడిపోయి, ఇప్పుడే దాసాను దాసుడవైపోకు తెలిసిందా?" అని హెచ్చరించారు. ఆ విధంగానే ఏర్పాట్లు జరిగాయి.

"పెళ్లి కొడుకు పెళ్లి కూతురు ఎక్కడికి వెళ్లి పోతున్నారు"? అని బంధువులు ప్రశ్నించారు సినిమాకి అని జవాబు చెప్పారు.

హోటల్ గదిలో ఫోం బెడ్‌మీద అలవోకగా పడుకుని "నే చేసిన ఏర్పాటు బాగుందా లీలా" అన్నాడు మనోహర్.

చిన్నగా నవ్వుతూ బుర్రనూపింది.

"బిల్లు మీ నాన్నగారు గాని మా నాన్నగాని ఇయ్యక్కరలేదు. నేనే ఇస్తాను అన్నాడు.

ప్రశంసగా చూస్తూ అతని ఎదపై పూలమాలలా వాలిపోయింది.

చిత్రం. పెళ్లి సంగతులేవీ వారి మధ్యకు రాలేదు.

వారి పెదవుల మధ్యకు మాటలు చొరబడ లేక పోయాయి.

కన్నులు మాత్రం అనేక భాషలు మాట్లాడు కున్నాయి. అనంత ప్రేమ సాగరాల్ని దర్శించాయి.

చిరునవ్వులు ఇద్దరినీ సమ్మోహపరిచి సంధాన పరిచాయి.

** ** **

లీల భర్తతో అత్తవారింటికి వచ్చేసింది. రిసెప్షన్ జరుగుతోంది. "మాటకీ చీటికీ కూర్చుని లేచి గుంజీలు తీయొద్దు. కూర్చునే నమస్కారాలు చేద్దాం" అంది.

వదినగారేదో చెప్పడం, అది అన్నగారు వినెయ్యడం. దూరం నుంచే పసిగట్టి శంతా, సరళలు(మనోహర్ చెల్లెళ్లు) అన్నవదినల దగ్గరకొచ్చారు.

"వదినగారేంటి ఆజ్ఞాపిస్తున్నారు?" అంది సరళ.

"మరీ దాసుడవై పోకు అన్నయ్యా" అంది శాంతి.

మనోహర్ చిన్నగానవ్వి ఊరుకున్నాడు.

చిరాకును మనసులో నొక్కిపట్టి, చిరునవ్వును పెదవుల మీదకు తెచ్చుకుంది లీల. "శాంతీ సరళా. మీరు చదువుకుంటున్నారు. ఇలాంటి మాటలు మానెయ్యండి" అంది.

వారిద్దరికీ వదినగారి మందలింపు చాలా కోపాన్ని తెప్పించింది. విసురుగా జనాల్లోకి వెళ్లిపోయారు.

భర్త ఫీలింగ్స్ ఎలా ఉంటాయో అని నోరకంటితో చూసింది. కాని అతను వేరే దిశ చూస్తున్నాడు.

చుట్టాలందరూ వెళ్లిపోయారు.

కోడలు ఒకటి రెండు రోజులు ఆలశ్యంగా నిద్ర లేచినా అత్తగారు ఏమీ అనుకోలేదు.

ఆ తరువాత కూడా కోడలు ప్రొద్దెక్కి లేవడం, సుందరమ్మ గారికి, చాలా కోపం తెప్పించింది. లోలోపల ఏవేవో భయాలు శంకలు తలెత్తుతున్నాయి. ఇంతలో కొడుకు మేడదిగి వచ్చాడు.

"లీల ఇంకా లేవలేదుట్రా" అంది కొంచెం చిరాగ్గా.

"లేదు కాఫీ చేసినట్లున్నావ్ ఫ్లాస్కులో పోసి ఇయ్యమ్మా" అని అతనింకా ఏదో అనబోతుండగానే అడ్డుకొని, "నౌకరీ చేస్తావా ఆవిడకి?" అంది విష్టూరంగా.

"నాకూ ఇంకా నిద్రగా ఉందమ్మా లేవగానే తాగాలి" అని వంటింటిలో గిన్నెలోని కాఫీ ఫ్లాస్కులో పోసి పైకి వచ్చేశాడు.

సరళ చేతులూ, మూతీ తిప్పుకుంది. "అమ్మా నీకు ఒక్కడే కొడుకు ఇంక, పూర్తిగా పరాయి అయిపో తున్నాడు చూసుకో" అని స్నానం చేయడానికి దొడ్లోకి వెళ్లిపోయింది.

సుందరమ్మగారికి కళ్లనీళ్ల పర్యంతమైంది. తన కొడుకు ఇంక పూర్తిగా పరాయి అయిపోతున్నాడని, దుఃఖపడుతూనే ఆవిడ వంటఇంటి పనిలో మునిగి పోయింది.

ఇంతలో కోడలు మేడమీద నుంచి దిగింది.

మంచి ముత్యంలా మెరుస్తున్న కోడల్ని చూసి ఒక్క క్షణం మనసులో మురిసింది. మరుక్షణం ముఖం ముడుచుకుంది. "అత్తింటి కోడలివి నువ్విలా నీ చిత్తం వచ్చినప్పుడు లేస్తే ఇంటిపనులెలా తెములుతాయి? ఆడపిల్లలు అత్తింట్లో ఎలా ఉండాలో మీ అమ్మ చెప్పలేదా?" అంది.

ఆ మాటకి మల్లె విరిసినట్లు నవ్వింది లీల. "మా అమ్మ ఒకర్తె ఏమిటండీ, లోకమంతా ఒకే మాట చెబుతూంది. కాని లోకమంతా ఒక్కలా ఉండదుగా" చలిపిగా అంది.

కోడలి కేసి చిరాకుగా చూస్తూ ఆవిడ వంటింటిలోకి వెళ్ళిపోయింది. ఆవిడ వెనకాలే తనూ వంటింటిలోకి వెళ్ళి, గొంతు తగ్గించి, అంది.

"చూడండి అత్తయ్యా నాకు కొత్త మీరు కొత్తగా కాపరానికొచ్చిన రోజులు గుర్తు తెచ్చుకోండి. మామగారు మీమనేవారు ఏం చేసేవారు?" అంది చిలిపి నవ్వుతో.

ఆ మాటకి పక్కున నవ్వింది సుందరమ్మ. నవ్వి "ఇకచాల్లే మా కాలంలో ఇలాంటి విడ్డూరాలేరుగం. పోపు పెట్టాను ఆ పచ్చడి మారు. అరటికాయలు సన్నగా తరుగు ఉదయం పూటా ఆ తెల్ల చీరేమిటి?" ఎలా అయినా తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని సుందరమ్మ గారి తాపత్రయం.

లీల, మరేమీ మాట్లాడక పనిలో మునిగిపోయింది. అపనికాస్తా ముగించి, మేడెక్కేసింది.

కాసేపటికి మనోహర్ మేడ దిగాడు.

"చూడు అబ్బాయీ భార్యని మరీ నెత్తినెక్కించుకోకు. పెళ్ళి రోజునుంచీ చూస్తూన్నాను నీవాలకం ప్రవర్తనా ఏం బాగాలేదు. చవటలా చూస్తుంది నిన్ను ఆ అమ్మాయి" అంది.

"పరాయి ఇంటినుంచి విన్నగాక మొన్నవచ్చింది. నువ్వు మరీ ఇదిగా మాట్లాడకమ్మా" అని బాత్‌రూం లోకి దూరాడు.

పైకి వచ్చాక లీల అంది. "మీకు మరీ ఇబ్బందిగా ఉన్నట్టుంది కదూ?

ఏది?

"అదే ఇద్దరాడవాళ్లమధ్య" కిలా కిలా నవ్వింది.

"ఏమీ లేదు అని తనూ అదే చిరు నవ్వుతో సమాధానం చెప్పాడు. 'నీ చిలిపి తనం నాకు తెలుసు. నీ సవాళ్లని ఎన్నింటినైనా ఎదుర్కోవగలను' అన్నట్లు ధీమాగా చూశాడు ఆమె కళ్లలోకి.

ఆ మరునాడు కాక మరునాడు హనీ మూన్‌కని ప్రయాణం పెట్టాడు.

'అయ్యో వీడి విడ్డూరం బంగారంగానూ ఇంట్లో బాగాలేదని ఊళ్లు తిప్పుతాడు కాబోలు. ఆ తరువాత వేరు కాపరం పెట్టేస్తాడో ఏమిటో. ఈ కాలం పిల్లల కన్నీ దుర్బుద్ధులే. అయ్యో నాగతి ఇంకేం కాను? నా అన్నకూతుర్ని చేసుకుంటానంటే సడనిచ్చారు కాదు. అని, భర్తని దులిపెయ్యడం మొదలుపెట్టింది. సుందరమ్మ కొడుకూ కోడలూ వెళ్ళాక అగ్నిలో ఆజ్యం పోసినట్లు కూతుళ్ల ఆమెకు వత్తాసు పలుకు తున్నారు.

** ** **

కొన్నాళ్ళ కులాసాగా తిరిగి వచ్చారా నూతన దంపతులు. పేరు పేరునా బహుమతులు తెచ్చారు. ప్రయాణ బడలికలు తీరాయి.

ఆ రోజు శనివారం. మనోహర్ గాఢంగా నిద్ర తీస్తున్నాడు. లీల పైకి వచ్చి, "లేవండి శ్రీవారు అని సుప్రభాతం పాడింది.'

## శ్రీ శ్రీ

పది పద్మశ్రీలను నీ
పద పద్మశ్రీల కొసగి ప్రార్థించిన నున్
పెదవుల పదవుల పదముల
ఒదవనిదది నీదుకీర్తి ఓహో శ్రీ శ్రీ!

ఓనమాలను దిద్దెడు కూనయైన
కావ్యమును వ్రాయు ఏ మహాకవియునైన
మొదట శ్రీకారమును చుట్టి మొదలుపెట్టు
శ్రీలపై కొన్న శ్రీని-శ్రీ శ్రీని! నీవు.

-అవధాని మాడుగుల నాగఫణి శర్మ

ఉలిక్కిపడి కళ్లు విప్పాడు. లీలను అలా చూసి విస్తుబోయాడు. ఎర్రని పట్టుచీర, స్నానం చేసి జారుముడి వేసిన జుట్టు. ముడిలో ముద్ద మందారం. కెంపుల వంపు పెదవులు ఊరిస్తుంటే రెండుచేతులూ పట్టి మీదికి లాక్కోబోయాడు.

"ఆగండి మడిగట్టుకున్నాను. ఎంగిలి చేయకండి" అంది. దూరంగా జరిగి.

అదే చిలిపి చూపు అదే చిరునవ్వు. ఆటపట్టించే సవాళ్ళలో మాత్రం కాస్త మార్పు కనిపించింది.

"ఎప్పుడు లేచావ్, ఎప్పుడు మడిగట్టావ్ ఏమిటీవింత?"

"క్రిందికి రండి చెబుతా" అని గిర్రున వెనక్కి తిరిగి చక చకా మేడ దిగిపోయింది లీల.



ప్రమిదల ప్రమద  చిత్రం: పెంచలయ్య

అతడూ ఆశ్చర్య సంభ్రమాలలో క్రిందికి దిగి వచ్చాడు.

లీల వంట ఇంటిలో చక చకా వంటలు తయారు చేసింది. తల్లి దేముని గదిలో మంత్రాలు చదువుతూ పూజ చేసుకుంటోంది. "కాఫీ ఇస్తావా అన్నాడు వంట ఇంటిలో కొచ్చి.

"అబ్బే ఇలా వీల్లేదు స్నానం చేసి మడిగట్టుకు రండి" అంది కిలకిలా నవ్వుతూ.

అతను స్నానం చేసి వచ్చి డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నాడు. తల్లీ తండ్రీ అంతా చేరారు టేబిల్ దగ్గరకి.

"కోడలు ఏమో అనుకున్నానుగాని వంట పనులన్నీ చక చకా చేస్తోందిరా చూడు. ఇప్పుడు పొంగలి తెస్తుంది. నా దేముడికీ మనకీ ఈ రోజు ఫలహారం ఇదే" అంది గుస గుసగా కొడుకుతో.

అందరికీ, తలో ప్లేటులోనూ, పొంగలి తెచ్చి తనూ వో ప్లేటు తెచ్చుకు కూర్చుంది. అందరికీ చాలా సంతోషంగావుంది.

సరళా, శాంతీ, మండిపిళ్ళ కాఫీ వగైరా సర్వ్ చేశారు. పొంగలి చాలా బాగుందని మెచ్చుకుంటూ తిన్నారు.

"కోడలికి కొత్త నువ్వెళ్లి సాయం చెయ్యి" అన్నాడు సుందరమ్మగారి భర్త.

"నువ్వొద్దులే అమ్మా వదినకి మేం సాయం చేస్తాం" అన్నారు ఆడపిల్లలు.

"కూరలు తరిగేసి మీరు వెళ్ళి చదువుకోండి. మధ్యాహ్నం భోజనంలోకి సాయంత్రం ఫలహారానికీ, చక్రపొంగలీ పులిహోరా చేసేస్తున్నాను. మనం విశ్రాంతి తీసుకుని ఫలహారం చేసి అంతా మీ అమ్మగారికిష్టమైన వెంకటేశ్వరుని గుడికి వెళ్ళి అక్కడ నుంచి సినిమాకి వెళ్దాం"

"మీరంతా వెళ్లండి నేనూ అమ్మ గుళ్లో నుంచి

హరికథవుంది. వుండిపోతాం మేం సినిమాకి రాం'' అన్నారాయన.

సరళా శాంతి తమ గదుల్లోకి చదువుకోడానికి వెళ్లిపోయారు.

సుందరమ్మగారు ముందు హాల్లో కొచ్చి భర్త ప్రక్కన సోఫాలో కూర్చున్నారు. ఉన్నట్లుండి ''నేను పుణ్యాత్మురాలిని కొడుకు బంగారం, కోడలు మంచి ముత్యం. నా కడుపున పుట్టబట్టే నా కొడుకు బంగారం కొండ అయ్యాడు. నా కోడల్ని కష్టపెట్టక సుఖ పెడుతున్నాడు. వాడు సుఖ పెడుతుండబట్టే ఆ అమ్మాయి మంచిముత్యంలా తయారయింది. మీరు నన్నెపుడైనా అలా సుఖపెట్టారా? ఎప్పుడూ అదనీ ఇదనీ, మీరూ, మీవాళ్లూ, కాల్చుకు తిన్నారు కదా''

కోడల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను ముందు. ఎంతో మంచి పిల్ల. ఉద్యోగం చేస్తుందట. ఆ డబ్బు తెచ్చి నాకే ఇస్తుందట. పరాయి ఇంటి పిల్ల ఆ పిల్ల నాకెందు కియ్యాలి ఆ పిల్ల డబ్బు ఆ పిల్లకే దాచేస్తాను''.

''అబ్బ ఎన్నిమాటలన్నావ్. ఎంత మారిపోయావు. ఆ పిల్ల డబ్బు నిజంగా తీసుకోకు. నీకు కావలిస్తే నేనిస్తాను''

''అబ్బ ఎంత మంచిమాటన్నారు ఎన్నాళ్లకి?'' కిల కిలా నవ్వింది.

ఆమె నవ్వులో తన నవ్వుకలిపారు.

తల్లిదండ్రులు విరగబడి నవ్వు కోవడం చూసి

## కాన్వెంటు చదువు

ఎత్తిన యిసక తట్టను
మొయ్యలేక
నిలువునా కూలబడ్డ కొడుకుని
తండ్రి కసురుతూ
మ్మాడా నీ ఈడు ఆ పాప
రెండు యిసక తట్టల బరువుని
ఎలా మోస్తూందో అన్నాడు
పుస్తకాలు మోసుకెళ్తూన్న
కాన్వెంటు పాపను చూపుతూ!

-అడిగోపుల వెంకటరత్నవ్.

గదిలోంచి తొంగి చూశారు సరళ శాంతి. ''అమ్మా నాన్న ఎప్పుడూ పోట్లాడుకోవడమే గాని ఇలా నవ్వు కోవడం చూళ్లేదు కదే'' అంది సరళ శాంతితో.

వంటింటిలోంచి లీలా తొంగిచూసింది. ఆమెకొంగు వెనకాలే తిరుగుతున్న మనోహరు చూశాడు. తల్లి తండ్రీ అలా నవ్వుకోవడం అతనికెంతో సంతోషాన్ని కలిగించింది. వెంటనే లీలవైపు తిరిగి ''లీలా మీ నాన్నగారు కన్యాదానం చేయలేదుగాని కాంతిని కానుకగా ఇచ్చారు. పరిమళ భరితమైన నో పుష్పాన్ని పారితోషికంగా ఇచ్చారు. దాని పరిమళాలు ఇల్లంతా వికసించాయి''

''కాదు'' అంది టక్కున.

''మరి'' అన్నాడు ఆశ్చర్యబోతూ.

''అందమైన చందమామని మంచిగంధాన్ని, మలయ మారుతాన్ని నా సొత్తు చేసుకున్నాను.''

''దేనితో'' అన్నాడు చిలిపిగా.

''చిరునవ్వుతో'' ఆమెమాట పూర్తికాకుండా పెదవులుమూసేశాడు. తన పెదవులతో.

''అయ్యో, అయ్యో మడి దూరం. అబ్బ ఇది వంటిల్లండీ. పడగ్గదిలోకి పొండి అత్తగారు చూడకుండా వస్తాను'' అంది. అతన్ని వెనక్కినెట్టుతూ వెన్నెల్లా నవ్వుతూ.

అంకితం:సింహాచల చందన స్వామికి
వందనములతో.




SREE VIJAYA ADS